# హస్తంలో అసంతృప్తి జ్వాలలు

- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో ముసలం
- ఎమ్మెల్యే సీట్ల కేటాయింపుల్లో భగ్గుమంటున్న అంతర్గత కలహాలు
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న లుకలుకలు
- తాజాగా 'కొత్తగూడెం'లో బయటపడిన విభేదాలు

ఖమ్మం, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలు ఎగసిపడుతున్నాయి. శాసనసభ టికెట్ల పంచాయితీ ప్రకంపనలు సృష్టిస్తోంది. దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకొని జెండా మోసిన సీనియర్ నేతలకు టికెట్ల కేటాయింపులో మొండిచేయి చూపడంతో పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ముందు వచ్చిన చెవుల కన్నా.. వెనుక వచ్చిన కొమ్ములకే ప్రాధాన్యం' అనే రీతిలో కాంగ్రెస్ తీరు ఉందని మండిపడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ.. ఐదేళ్లుగా కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి.. ద్వితీయ శ్రేణి, పార్టీ నాయకులను కాపాడుకున్న తమను నిర్లక్ష్యం చేయడంపై కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. కొత్తగూడెంలో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న ఎడవల్లి కృష్ణ వర్గానికి చెందిన రాజేంద్రప్రసాద్ సోమవారం సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. పోలీసులు జోక్యం చేసుకొని కిందకు దించారు. అలాగే మరో నేత, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుకు కొత్తగూడెం సీటు కేటాయించాలని పోస్టాఫీస్ సెంటర్‌లో కార్యకర్తలు నిరసన తెలిపారు.

### ఆశావహుల దరఖాస్తులు..

ఉమ్మడి జిల్లాలోని పది శాసనసభ నియోజకవర్గాలకు గాను రెండు ఎస్సీ, ఐదు ఎస్టీ, మూడు జనరల్ చొప్పున రిజర్వ్ అయి ఉన్నాయి. దీంతో కాంగ్రెస్ టికెట్ ఆశించే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు పార్టీకి చెందిన ఆశావహులు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారిలో సర్వేలు, వడపోతల పేరుతో అనేక మందికి అవకాశాలు రాకుండా పెద్ద స్థాయిలో ప్రయత్నాలు, పైరవీలు జరుగుతుండడంతో ఇన్నేళ్లు పార్టీ కోసం పనిచేసిన నేతలు ఇదేమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఈ సారి అవకాశం ఇవ్వకపోతే తాడోపేడో తేల్చుకుంటామని, తమ దారి తాము చూసుకుంటామని కొంతమంది నేతలు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు సిట్టింగ్ స్థానాలైన భద్రాచలం, మధిర నియోజకవర్గాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం, కొత్తగూడెం, పాలేరు నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన నేతలు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జావేద్, గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన రాయల నాగేశ్వరరావు ఆదివారం రాత్రి ఖమ్మంలో పోట్ల నాగేశ్వరరావు ఇంట్లో తక్షణ కర్తవ్యం, భవిష్యత్ ప్రణాళికపై సమావేశమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాల తరబడి సేవలందించినా, కష్టకాలంలో అండగా ఉండి కార్యకర్తలను కాపాడుకున్నా.. పార్టీ గుర్తించే పరిస్థితి లేకపోవడంపై సమావేశంలో వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించి.. శాపనార్థాలు పెట్టిన నేతలకు పెద్దపీట వేయడాన్ని పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, వారికి ఏం సమాధానం చెప్పాలని అసంతృప్తి నేతలు ప్రశ్నించినట్లు తెలిసింది.

### ఆశావహుల ఆవేదన

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ సీటును ఆశించిన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావేద్.. శాసనసభా పక్ష నేత భట్టివిక్రమార్కకు అత్యంత సన్నిహితుడిగా పార్టీలో గుర్తింపు పొందారు. కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడంతోపాటు ప్రతి కార్యక్రమాన్ని భుజాన వేసుకుని విజయవంతం చేస్తే తనకు దక్కింది ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం అసెంబ్లీ టికెట్ ఖరారు చేసిందన్న ప్రచారం పార్టీలో జోరుగా సాగుతోంది. ఇక కొత్తగూడెం కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశించిన పోట్ల నాగేశ్వరరావు సైతం తనకు టికెట్ ఇచ్చే అంశంపై పార్టీ అధిష్టానం నుంచి ఎటువంటి స్పష్టత, భరోసా రాకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తికి, ఆగ్రహానికి గురయ్యారు. ఇతర పార్టీల ముఖ్య నేతలు చేరకముందు నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న పోట్ల నాగేశ్వరరావు మూడేళ్లుగా కొత్తగూడెం నియోజకవర్గంపై దృష్టి సారించి పార్టీ కార్యకలాపాలను కొనసాగించారు. అక్కడ క్యాంపు కార్యాలయాన్ని సైతం ఏర్పాటు చేసుకున్నారు. అలాగే పార్టీలో మరో బీసీ నేతగా, జిల్లా నాయకుడిగా గుర్తింపు పొందిన ఎడవల్లి కృష్ణ సైతం కాంగ్రెస్ పార్టీ నుంచి కొత్తగూడెం అసెంబ్లీ టికెట్‌ను ఆశించారు. కాంగ్రెస్ పార్టీతో వామపక్షాలకు పొత్తు కుదురుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పొత్తులో భాగంగా కొత్తగూడెం సీటును సీపీఐకు కేటాయిస్తారన్న ఊహాగానాల నేపథ్యంలో ఇటు పోట్ల నాగేశ్వరరావు, అటు ఎడవల్లి కృష్ణ వర్గీయులు తమ నేతల రాజకీయ భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని వారిపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

## 'గూడెం' కాంగ్రెస్‌లో 'టికెట్' చిచ్చు

- బట్టబయలవుతున్న గ్రూప్ రాజకీయాలు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): 'కొత్తగూడెం' కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు భగ్గుమంటున్నాయి. గ్రూప్ రాజకీయాలు రచ్చకెక్కుతున్నాయి. 'ఎవరికి వారే యమునా తీరే..' అన్నట్లుగా 'హస్తం' బలగం పయనం కొనసాగుతున్నది. 'గూడెం'లో ఆ పార్టీ ప్రధానంగా నాలుగు వర్గాలుగా విడిపోయింది. ఒకవర్గం ఎడవల్లి కృష్ణ వర్గం, రెండో వర్గం మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు వర్గం, మూడోవర్గం నాగ సీతారాములు వర్గం కాగా నాలుగో వర్గం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గం. ఈ నాలుగు వర్గాల మధ్య నిత్యం ఏదో ఒక విధంగా అంతర్గత కలహాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిలో భాగంగానే సోమవారం ఎడవల్లి కృష్ణ వర్గానికి చెందిన వ్యక్తి రాజేంద్రప్రసాద్ కొత్తగూడెంలోని ఓ సెల్‌టవర్ ఎక్కి 'ఎడవల్లి'కి పార్టీ అధిష్ఠానం టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు జోక్యం చేసుకుని నిరసనకారుడికి నచ్చజెప్పి కిందికి వచ్చేలా చేశారు. మరోవైపు మరో కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించాలని పోస్టాఫీస్ సంటర్‌లో ఆయన వర్గీలయులు ఫ్లకార్డులు ప్రదర్శించారు. చివరకు 'ఏ నావది ఏ తీరమో..' వేచి చూడాల్సిందే..!



సెల్ టవర్ ఎక్కిన 'ఎడవల్లి' అనుచరుడు

### బీఆర్ఎస్‌లో చేరిక అంశం చర్చకు..

ఖమ్మంలో పోట్ల నాగేశ్వరరావు ఇంట్లో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో కాంగ్రెస్ తమకు మొండిచేయి చూపితే బీఆర్ఎస్ పార్టీ వైపు దృష్టి సారిస్తే ఎలా ఉంటుందన్న అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. సదరు నాయకులకు బీఆర్ఎస్‌లో ఉన్న కొందరు నేతలతో వ్యక్తిగత సాన్నిహిత్యం ఉన్న నేపథ్యంలో ఆయా నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరే అంశంపై పలు కోణాల్లో చర్చించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది ఇద్దరినే. మధిర, భద్రాచలంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలైన మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే పొదెం వీరయ్యల అభ్యర్థిత్వాలను మాత్రమే ఖరారు చేసింది. మిగిలిన 8 స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ఖరారు చేయకపోయినా.. ఆయా నియోజకవర్గాల్లో టికెట్ ఆశిస్తున్న నేతలతోపాటు వారి వర్గీయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై పార్టీ కార్యకర్తలతోనూ సమాలోచనలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## ఖగ వాహిని.. మోహినీ జయ జయహే సంతానలక్ష్మి

భద్రాచలం, అక్టోబర్ 16: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండోరోజు సోమవారం లక్ష్మీతాయారమ్మ భక్తులకు సంతానలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయం అమ్మవారికి పంచామృతాలు, తొమ్మిది రకాల పండ్ల రసాలు, నారికేళ జలాలతో అభిషేకం, అష్టోత్తర శతనామార్చన చేశారు. చిత్రకూట మండపంలో సంక్షేప రామాయణ హోమం చేపట్టారు. శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి తాము కోరుకున్న అవతారంలో గోత్ర, నామాలతో అర్చన చేయించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. అందుకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శాశ్వత ఉభయత్వానికి రూ.10 వేలు చెల్లించి రశీదు పొందాలని కోరారు. కాగా మంగళవారం లక్ష్మీతాయారమ్మ వారు గజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధికి కొనసాగింపు

**బీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి వనమా**

పాల్వంచ రూరల్, అక్టోబర్ 16: బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధికి కొనసాగింపు సాధ్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరావు అన్నారు. సోమవారం ఆయన రంగాపురం గ్రామంలో తొలిరోజు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమం కోసం తొమ్మిదిన్నరేళ్లుగా పనిచేస్తున్నారని, ఇక ముందు కూడా అభివృద్ధి, సంక్షేమం వర్ధిల్లాలంటే బీఆర్ఎస్‌నే గెలిపించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఏదో ఒక ప్రభుత్వ పథకం అందిందని, కార్యకర్తలు పథకాలను చూపిస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ సీతాలక్ష్మి, జడ్పీటీసీ వాసుదేవరావు, ఎంపీపీ మడి సరస్వతి, సర్పంచ్ బాదావత్ శాంతి, నాయకులు కిలారు నాగేశ్వరరావు, రామలింగం, కనకేశ్, నారాయణరావు, రాజూగౌడ్; శ్రీరామ్మూర్తి, విశ్వనాథం, రాంబాబు, వీరయ్య, ప్రకాశరావు, బాలకృష్ణ, దాసరి నాగేశ్వరావు, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, విజయ్, వెంగళరావు, పాపాయ్య, వెంకట్, అన్వర్ పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

# బీఆర్ఎస్‌కు ప్రజలే హైకమాండ్

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

మధిర, అక్టోబర్ 16: కాంగ్రెసోళ్లకు ఢిల్లీ ప్రభువులు హైకమాండ్ అయితే.. బీఆర్ఎస్‌కు ప్రజలే హైకమాండ్ అని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మధిర పట్టణంలో సోమవారం ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజుతో కలిసి బోనకల్లు, ఎర్రుపాలెం, ముదిగొండ, చింతకాని, మధిర మండలాలకు చెందిన 5 వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ ప్రైవేటు స్థలంలో నిర్వహించిన పార్టీ జోనల్ స్థాయి బూత్ కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడారు. వలస పాలకుల పాలనలో ప్రజలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారు. మధిర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మల్లు భట్టి విక్రమార్క ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదన్నారు. కానీ లింగాల కమల్‌రాజు ఒకవైపు జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేశారని గుర్తుచేశారు. కార్యకర్తలు, నాయకులు 45 రోజుల పాటు సైనికుల్లా పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థి కమల్‌రాజును గెలిపించుకోవాలన్నారు. బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో విడుదల చేస్తే పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తమ పార్టీ స్కీములను కాపీ కొట్టారని వ్యాఖ్యానించడం అవివేకమన్నారు. కాంగ్రెస్ పార్టీనే బీఆర్ఎస్ ఆసరా పథకాన్ని కాపీ కొట్టిందని మండిపడ్డారు. కార్యకర్తలు వచ్చే నెల 5న ఖమ్మంలో జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గం నుంచి భారీ జనసమీకరణ చేయాలన్నారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గడిచిన ఎన్నికల్లో కొందరు పక్కనే ఉండి, తీరా పోలింగ్ నాటికి కమల్‌రాజుకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేసి కమల్‌రాజును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించాలన్నారు. తాను నియోజకవర్గంలో నిర్వహించే ప్రతి సమావేశానికి హాజరవుతానన్నారు. బీఆర్ఎస్ మధిర అభ్యర్థి లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ.. తాను మధిర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయానన్నారు. నాలుగోసారీ పోటీ చేస్తున్నానని, ప్రజలు కారు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానన్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇప్పటివరకు అనేక సంస్థలు నిర్వహించిన సర్వేలన్నీ బీఆర్ఎస్‌కు అనుకూలంగానే ఉన్నాయన్నారు. దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెసోళ్లు ప్రజలకు ఏ ప్రయోజనమూ చేకూర్చలేదన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలోనే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ లత, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ రామారావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ విద్యాలత, ఎంపీపీలు శిరీష, లలిత, పూర్ణయ్య, జడ్పీటీసీలు కవిత, దుర్గ, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మల్లికార్జున్, సాంబశివరావు, లక్ష్మారెడ్డి, పుల్లయ్య, వేమూరి ప్రసాద్, పోట్ల ప్రసాద్, చావా వేణు, వాసు, కృష్ణప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల



ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

